క్లుప్తంగా

గర్నెపూడిలో పూజలు, ప్రార్థనలు



సత్తెనపల్లి: మండలంలోని గర్నెపూడి గ్రామంలో ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పూజలు, చర్చిలో ప్రార్థనల్లో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గురువారం పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని స్వర్గీయ నందమూరి తారకరామారావు, స్వర్గీయ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే నిర్వహణ



ముప్పాళ్ల: అంగన్‌వాడీ ప్రాజెక్టు సత్తెనపల్లి పరిధిలో గల ఇరుకుపాలెం సెక్టారులో దమ్మాలపాడు అంగన్‌వాడీ కేంద్రంలో ఐదేళ్లు నిండిన పిల్లలకు ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి పాఠశాల హెచ్‌ఎం నాసరయ్య, ఉపాధ్యాయులు జి.ఆశాలత, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పద్మావతి, డి.బుజ్జిరాణి, టి.ప్రమీల, డి.రమాదేవి, సీహెచ్ సుమలత, ఎల్.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అమ్మ చేయూత చారిటబుల్ సంస్థ సేవలు అభినందనీయం

సత్తెనపల్లి: అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ నాయకులు చింకా అంకమ్మరావు అన్నారు. క్యాలిబర్ జానీ మనవడు మహమ్మద్ షేహజాద్ స్కూల్‌లో జాయిన్ అయిన సందర్భంగా గురువారం పట్టణంలోని రైల్వే స్టేషన్, తాలూకా సెంటర్‌లో అన్నార్తులకు అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంకమ్మరావు మాట్లాడుతూ అమ్మ చేయూత చారిటబుల్ స్వచ్ఛంద సంస్థకు దాతల సహకారం మరువలేనిదన్నారు. దాతల సహకారంతో మరెన్నో సేవా కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రెసిడెంట్ కె.దస్తగిరి, సభ్యులు పిక్కిలి రత్తయ్య, ప్రత్తిపాటి హరేకృష్ణ, కందుల అంబేడ్కర్, తోడేటి సుభాష్ చంద్రబోస్‌లు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రం విషయమై ఘర్షణ

బొల్లాపల్లి: విద్యార్థులకు ధ్రువీకరణ పత్రం జారీ చేసే విషయంలో ఉపాధ్యాయుడికి, కాంప్లెక్సు సీఆర్పీకి ఏర్పడిన వివాదం చివరకు ఘర్షణకు దారితీసింది. బండ్లమోటు ఎస్సై డి.చెన్నకేశవులు కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు కాపర్తి మహమ్మద్ సుభాని, అదే కాంప్లెక్సు చెందిన సీఆర్పీ టి.ఇమామ్ షాహెబ్‌కు మధ్య విద్యార్థికి చెందిన కుల ధ్రువీకరణ పత్రం విషయంలో వివాదం ఏర్పడింది. ఇది ముదిరి చివరకు ఘర్షణకు దారితీసింది. తనపై సీఆర్పీ దాడికి చేశారంటూ ఉపాధ్యాయుడు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, సీఆర్పీతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

బొల్లాపల్లి: పచ్చిరొట్ట ఎరువుకు అవసరమైన విత్తనాలు రాయితీపై రైతులకు ఆయా సచివాలయాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ ఎ.అంకారావు తెలిపారు. జనుము, జీలుగలు, పల్లిపెసర రాయితీపై పంపిణీ చేస్తున్నామన్నారు. ఒక్కొక్క రైతుకు 5 ఎకరాల వరకు సరిపడా, ఎకరాకు పది కిలోల వంతున, 50 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కావల్సిన రైతులు ఆయా సచివాలయాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది ద్వారా పొందవచ్చని తెలిపారు. అలాగే మండలంలోని చక్రాయపాలెం సచివాలయంలో రైతులకు గ్రామ సర్పంచ్ కె.లక్ష్మానాయక్ చేతుల మీదుగ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై జనుము, జీలుగ విత్తనాలు రైతులకు పంపిణీ చేశామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది కమలాకర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రెండు ఆర్‌బీకేల్లో గ్రామ సభలు

నాదెండ్ల: నాదెండ్లలోని రెండు రైతు భరోసా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అధికారులు గ్రామ సభలు నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎ.హరిప్రసాద్, డీటీ అనురాధ పాల్గొన్నారు. రెండు ఆర్‌బీకేల్లో తొలిరోజు 40 మంది కౌలు రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఏవో మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అర్హులైన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఈ కార్డుల వలన కౌలు రైతులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీ పథకాల్లో లబ్ధి చేకూరుతుందన్నారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

- పశువుల ఎరువుతో నేల సారవంతం
- గ్రామాల్లో పశువుల ఎరువుకు డిమాండ్
- పొలాల్లో గొర్రెలు, మేకలను నిలుపుతున్న రైతులు
- వాటి వ్యర్థాలతో పొలాలకు సత్తువ
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి
- తగ్గనున్న పంటల సాగు వ్యయం



పొలంలో పశువుల ఎరువు కుప్పలు

సత్తెనపల్లి: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నేలలోని పోషకాలు నిల్వల్లో సమతుల్యం లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల లోపాలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రియ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. పశువులు, మేకలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇది సేంద్రియ ఎరువుతో సమానం. దీన్ని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే చాలా మంచిది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడానికి వీలవుతుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతుంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువుల ఎరువు ఉపయోగపడుతుంది. ఎకరాకు నాలుగు నుంచి ఐదు ట్రాక్టర్ల పశువుల ఎరువును వినియోగించాలి.

తక్కువ ఖర్చుతో అధిక లాభాలు

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. అధిక ఎండల కారణంగా పొలంలో జల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. కాబట్టి పశువుల పేడను పొలంలో కుప్పలుగా పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీనివల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి పోషకాలు మొక్కలకు అందేలా సహాయపడతాయి. దీంతో రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు.

వాలుకు అడ్డంగా దుక్కి దున్నాలి

పొలాన్ని ఎలా పడితే అలా దున్నడం వల్ల పంటలకు నష్టం వాటిల్లుతుంది. రైతులు వేసవి కాలంలో మెట్ట భూములను సీజన్ కోసం సన్నద్ధం చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో భూమి వాలుకు అడ్డంగా దుక్కి చేయాలి. ఎందుకంటే వేసవిలో వచ్చే అధిక వర్షాలకు ఎంతో సారవంతమైన మట్టి కొట్టుకుపోతుంది. వాలుకు అడ్డంగా దుక్కి దున్నితే నీటి ప్రవాహం తగ్గి మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది.



ట్రాక్టర్‌తో పొలంలో అన్‌లోడ్ చేస్తున్న పశువుల ఎరువు

పశువుల ఎరువుతో భూసారం పెంపు



పశువులు, మేకలు, గొర్రెల ఎరువు వేయడం వల్ల భూసారం పెరుగుతుంది. సహజసిద్ధమైన లక్షణాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపు చేసి పోషకాలను మొక్కలకు అందేలా సహాయపడతాయి. రైతులు తక్కువ ఖర్చుతో అధిక లాభాలు సాధించవచ్చు. ముఖ్యంగా ఎరువులు పొలాల్లో వేస్తే రసాయన ఎరువుల వినియోగం బాగా తగ్గుతుంది. ఇక మేకలు, గొర్రెలను నిలపడం వల్ల నేల సారవంతం అవుతుంది. అలాగే వాటి మూత్రం ద్వారా నత్రజని స్థాయి పెరుగుతుంది. వీటిని నిలపడం వల్ల యూరియా వినియోగం తగ్గుతుంది. పశువుల ఎరువులో 0.5 నుంచి 1.5 శాతం నత్రజని, 0.3 నుంచి 0.9 శాతం భాస్వరం, 0.5 నుంచి 1.9 శాతం పొటాషియం ఉంటాయి.

–ఎస్.శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఏడీఏ, సత్తెనపల్లి

ఖాళీ స్థలాల్లోని వ్యర్థాల తొలగింపు

- ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు చెత్త తొలగింపు
- ఇతర ప్రాంతాలనూ పరిశీలించిన కమిషనర్ కొలిమి షమ్మి

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: పట్టణ పరిధిలోని ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం తొలగింపునకు మున్సిపల్ అధికారులు సత్వర చర్యలు తీసుకున్నారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో సాక్షి దినపత్రికలో గురువారం ప్రచురితమైన 'ఖాళీ స్థలం.. వ్యాధులకు నిలయం' కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక వైపు ఖాళీ స్థలంలో డంపింగ్ యార్డ్‌లా చెత్తాచెదారం పేరుకు పోవడంతో తక్షణమే మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రత్యేక వాహనాలతో అక్కడ ఉన్న చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించారు. ఇకపై అక్కడ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవడానికి ఆ సచివాలయ పరిధిలోని శానిటేషన్ సెక్రటరీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక పట్టణంలోని ఇతర ఖాళీ స్థలాలను మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పరిశీలించారు. ఖాళీ స్థలాలను వెంటనే సంబంధిత యజమానులు శుభ్రం చేయించాలని, లేనిపక్షంలో నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌సారధి, శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఖాళీ స్థలంలో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



వ్యర్థాల తొలగింపు తర్వాత శుభ్రంగా ఉన్న స్థలం

బడిబాటతో బంగారు భవిష్యత్

- నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- సత్తెనపల్లి మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు
- జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంల సమావేశం



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు, పక్కన ఎంఈఓ–2 రాఘవేంద్రరావు

సత్తెనపల్లి: బాల్యం ప్రతి వ్యక్తి జీవితంలో మరపురాని జ్ఞాపకం అని, బంగారు లోకంలో విహరించాల్సిన వయసు అని, అలాంటి అందమైన బాల్యం నేడు పలువురికి దూరం అవుతుందని సత్తెనపల్లి మండల విద్యా శాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికొన్నతో పాఠశాలలో గురువారం 'నేను బడికి పోతా' కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓనమాలు దిద్దాల్సిన చిట్టి చేతులు పనులతో కందిపోతున్నాయని, బతుకు బాటలో శ్రామికులు, బాల కార్మికులుగా మారుతున్నారన్నారు. ఇలా బడి ఈడు పిల్లలు ఎంతమంది బయట ఉన్నారో పరిశీలించడానికి, వారిని పాఠశాలల్లో చేర్పించడానికి చేపట్టిందే నేను బడికి పోతా కార్యక్రమం అన్నారు. జూలై 12 వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. 6 నుంచి 14 ఏళ్ల లోపు బాలలు తప్పనిసరిగా పాఠశాలల్లో ఉండేలా చూడాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి–2 ఎ.రాఘవేంద్రరావు మాట్లాడుతూ బడి ఈడు బాలలంతా తప్పనిసరిగా బడిలోనే ఉండాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. అయినా కొంత మంది బడికి దూరంగా ఉంటున్నారని, 2024–25 విద్యా సంవత్సరానికి 'నేను బడికి పోతా' పేరిట పాఠశాలల సంసిద్ధత కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ, మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కమిటీల ద్వారా ప్రతి గృహాన్ని సందర్శించి బడి ఈడు బాలలందరూ పాఠశాలలకు వెళుతున్నారా లేదా అని నిర్ధారించాలన్నారు. ఇంకా ఎవరైనా బడి బయట ఉన్నారా? లేదా అనేది తెలుసుకునేందుకు జూలై 12 వరకు ప్రత్యేకంగా ఇంటింటి సర్వే జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సమావేశంలో సీఆర్పీలు నరేంద్ర, ప్రసాద్, శ్రీకాంత్, ప్రశాంతి, నీరజ, మల్లేశ్వరి, ఇందిరా, నారాయణమ్మ, ప్రధానోపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి భూమి పూజ



బస్‌షెల్టర్‌కు భూమి పూజలో స్నేహహస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు

అచ్చంపేట: మండలంలోని పలు గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం స్నేహహస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్‌సీ ముందు బస్‌షెల్టర్ నిర్మాణానికి గురువారం భూమి పూజ నిర్వహించారు. సంస్థ ఫౌండర్, ప్రవాసాంధ్రులు ఎంపీ రావు భార్య రాజ్యలక్ష్మి, సంస్థ గౌరవ సలహాదారు మామిళ్లపల్లి విజయలక్ష్మిలు బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి, సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. మండల కేంద్రమైన అచ్చంపేటలో బస్‌షెల్టర్ లేకపోవడం వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, ఉన్నత విద్యకు వచ్చే విద్యార్థులు ఎండలకు, వానలకు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారి అవస్థలు చూడలేక బస్‌షెల్టర్ నిర్మించాలని ఆలోచన చేశామన్నారు. 30 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో బస్‌షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షలు అవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. గతంలో తమ సంస్థ ద్వారా రోకటిగుంటవారిపాలెం అడ్డరోడ్డు వద్ద, క్రోసూరు మోడల్ స్కూలు వద్ద బస్‌షెల్టర్స్ నిర్మించినట్లు చెప్పారు. నిరుపేద విద్యార్థులకు ఆసరాగా ఉంటూ, విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. అందుకు విద్యాశాఖ, స్థానిక పెద్దల సహాయ సహకారాలు అందజేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆర్.నరసింహారావు, వైద్యాధికారి డాక్టర్ రాజేష్, సంస్థ కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, చెరుకుంపాలెం గ్రామాభివృద్ధి సంఘ అధ్యక్షులు తుమ్మా శౌర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో అన్ని రుగ్మతలు మాయం

కనపర్రు పాఠశాలలో విద్యార్థుల యోగాసనాల ప్రదర్శన



నాదెండ్ల /యడ్లపాడు: ఆధునిక జీవనశైలీలోని ప్రతి రుగ్మతకూ యోగాతో పరిష్కార మార్గం చూపుతోందని వైద్యనిపుణులు సైతం ఘంటాపథంగా వెల్లడిస్తున్నారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామంలో గురువారం యోగాసనాల కార్యక్రమం జరిగింది. జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ బీపీఆర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు వివిధ యోగ భంగిమలను అద్భుతంగా ప్రదర్శించారు. పాఠశాల ఉపాధ్యాయని వై.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పిల్లలకు క్రమశిక్షణ, నైతిక విలువలతో విద్యను అందిస్తున్నారు. వారిలో నైతిక విలువలు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధతో ధ్యానసిద్ధి, యోగసనాలు నేర్పిస్తున్నారు. శుక్రవారం నిర్వహించే ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో యోగా ప్రదర్శన ఏర్పాటు చేశామని రాజ్యలక్ష్మి తెలిపారు.

కౌలు రైతుల గుర్తింపు చట్టానికి సవరణ చేయాలి

కౌలు రైతు సంఘం ప్రతినిధులు

ఎర్రబాలెం(క్రోసూరు): భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులను గుర్తించే విధంగా చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉందని కౌలు రైతు సంఘం ప్రతినిధులు కోరారు. గురువారం మండలంలోని ఎర్రబాలెం రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి వేణుగోపాల్, తహసీల్దార్ ఎం.సువర్ణ ఆధ్వర్యంలో కౌలు కార్డులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కౌలు రైతు సంఘం కమిటీ సభ్యులు తిమ్మిసెట్టి హనుమంతరావు మాట్లాడుతూ 2019లో కౌలు రైతు సాగుదారుల చట్టం అమలు చేస్తూ గ్రామాలలో కౌలు రైతు గుర్తింపు కార్డు పొందాలంటే భూ యజమానులు సంతకం చేయాలనే నిబంధన పెట్టటం వలన గ్రామాల్లో 20–30 శాతం మంది మాత్రమే కౌలు కార్డులు పొందారన్నారు. ఈ రకంగా కౌలు రైతులు కార్డు తీసుకునే దగ్గరే ఆగిపోవటం జరుగుతుందన్నారు. దీంతో ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పంట విక్రయాలు, పంట నష్టపరిహారం, బీమా పొందటంలో కౌలు రైతులు తీవ్రంగా నష్టపోవటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కార్డుల కొరకు అర్జీ పెట్టుకున్న కౌలు రైతుకు యజమానితో ఏదైనా సమస్య వస్తే తాము పరిష్కరిస్తామని, దేవుడి మాన్యం సాగు చేసుకునే రైతులకు కూడా ఈవో ద్వారా గుర్తింపు కార్డులు మంజూరు చేస్తామన్నారు. కావున కౌలు రైతులు కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అర్హత కలిగిన కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి



అబ్బూరులో మాట్లాడుతున్న వీఆర్వో మరియదాసు పక్కన వీహెచ్‌ఏ పవన్‌కుమార్

సత్తెనపల్లి: భూమి కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాల (సీసీఆర్సీ కార్డులు) కోసం దరఖాస్తు చేసుకోవాలని గ్రామ రెవెన్యూ అధికారులు డి.మరియదాసు, ఎంటీ నాగేశ్వరరావు, కె.నాగమణి, జె.గోపి, ఎం.లలిత శివజ్యోతిలు అన్నారు. అర్హత కలిగిన కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు మంజూరు చేయుటకు సత్తెనపల్లి మండలం అబ్బూరు, ఫణిదం–1, ఫణిదం–2, బట్లూరు, భీమవరం గ్రామాల్లో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు దరఖాస్తు చేసుకున్న ఫారాలను ఆన్‌లైన్ చేసి మండలాధికారులకు అందించడం జరుగుతుందన్నారు. అనంతరం అర్హులైన కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఆయా సమావేశాల్లో వ్యవసాయ శాఖ వీహెచ్‌ఏలు డి.వి.డి.పవన్‌కుమార్, బి.వెంకటేశ్వరరావు, మండూరి షేక్ షెహనాజ్, షేక్ చాందిని, జె.యాకోబు, కౌలు రైతులు, తదితరులు ఉన్నారు.

'వెన్న'కి గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ పదవి ఇవ్వాలి

టీడీపీ మండల నాయకుల డిమాండ్



సమావేశంలో పాల్గొన్న మండల టీడీపీ నాయకులు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వెన్న సాంబశివరెడ్డికి గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవి ఇచ్చి, సముచిత స్థానం కల్పించాలని బెల్లంకొండ టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పార్టీలో కీలక నేతగా వ్యవహరిస్తూ అధిష్టానం, అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాలను తూచా తప్పకుండా ఆచరిస్తూ 2004, 2009లో పెదకూరపాడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందినప్పటికీ కార్యకర్తలకు అన్నీ తానై నిత్యం అండగా ఉన్నారన్నారు. నియోజకవర్గాన్ని టీడీపీ కంచుకోటగా నిలపడంలో క్రియాశీలక పాత్ర పోషించిన సాంబశివరెడ్డికి గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని కేటాయించాలన్నారు. 2014లో అధికారంలో ఉన్నప్పుడు మరో రెండు నెలల్లో ఎన్నికలు ఉన్నాయనగా 2019లో కేవలం రెండు నెలల ముందు గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని ఇచ్చారని గుర్తు చేశారు. పార్టీ కోసం అన్నీ కోల్పోయిన వెన్న సాంబశివరెడ్డికి తిరిగి గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ పదవిని ఇచ్చి పార్టీ గౌరవించాలని కోరారు. సర్పంచి గడ్డిపర్తి జ్యోతి సముద్రం, టీడీపీ నాయకులు వెన్న సీతారామరెడ్డి, పీఎస్కే రసూల్, సయ్యద్ జానీ, సత్యం, హుస్సేన్, సలాం, బద్దూరి వీరారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మునగపాటి సుభానీ, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య ఘర్షణ

9మందికి గాయాలు



సత్తెనపల్లి: మండలంలోని ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలో టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య గురువారం అర్ధరాత్రి 12.32గంటలకు ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రేషన్‌షాపు విషయంలో భాగ్యనగర్ కాలనీకి చెందిన గాడిదపాటి రాజేష్, గాడిదపాటి అప్పులమ్మ, గాడిదపాటి చిన్నబ్బాయి, అలాగే చిలకా అశోక్, చిలకా వీరయ్య, చిలకా అశ్విని మరికొంతమంది ఘర్షణ పడ్డారు. కర్రలు, రాళ్లతో ఇరువర్గాలు దాడిచేసుకున్నాయి. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన తొమ్మిది మంది తీవ్రగాయాలపాలయ్యారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో సైతం వీరు ఘర్షణకు దిగడంతో వైద్యులు, సిబ్బంది బెంబేలెత్తారు. ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవ ర్యాలీలో ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

రాజుపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా పర్యవేక్షకులు, హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు అన్నారు. మండలంలోని కొత్తబోధనంలో పాఠశాల విద్యార్థులతో కలసి మలేరియా నివారణ మాసోత్సవ ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి దోమల వలన ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. ఇంటి పరిసరాలలో మురికి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పరిసరాలలో ఉన్న రోళ్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ వేయడం వలన దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లీలావతి, ఎంఎల్‌హెచ్‌పీ అన్నాకుమారి, ఏఎన్‌ఎం ప్రమీలాభాయి, ఆశా కార్యకర్తలు రెబ్బమ్మ, ఈశ్వరమ్మ, మద్దెమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని మహిళా మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. చిలకలూరిపేట మండలం తాతపూడి గ్రామ సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఓ మహిళ మృతి చెంది ఉండటాన్ని గురువారం స్థానికులు గుర్తించి తమకు సమాచారం అందించారన్నారు. ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించగా మృతురాలు గత నాల్గురోజులుగా ఆ చెట్టుకిందనే కూర్చోని ఉందని, బాటసారులు భోజనం అందించినట్లు తెలిసిందన్నారు. సదరు మహిళ నాల్గు రోజుల కిందటే చనిపోయి ఉండవచ్చని, స్థానికులు ఆమె యాచకురాలిగా భావిస్తున్నామని, సుమారు 65కు పైగా వయస్సు ఉండొచ్చని తెలిపారు. మృతురాలి వంటిపై పసుపు రంగు లోలంగా, నీలిరంగు చీర ఉన్నట్లు మ్యాచింగ్ జాకెట్ ధరించి ఉందన్నారు. జుట్టు పూర్తిగా నెరిసిపోయి ఉందని ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి వార్షిక వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారి చిలకపాటి భరద్వాజ కల్యాణ క్రతువు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరై పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాయంత్రం ఆలయంలో భజన, పారాయణలు నిర్వహించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం



వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ 7వ వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బండికట్ల మహేష్ స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమద్విరాట్ పోతులూరి బ్రహ్మేంద్రస్వామి, గోవిందమ్మల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.